నమస్తే తెలంగాణ

మహబూబాబాద్

5 | వరంగల్, ఆదివారం 15 డిసెంబర్ 2024 | MAHABUBABAD


## దళారీ బెడద తప్పించినందుకు ధన్యవాదాలు



మహబూబాబాద్ ఎస్పీ, న్యాయమూర్తి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న బాధితుడు వెంకన్న

- ఎస్పీ, న్యాయమూర్తి చిత్రపటాలకు బాధితుడి క్షీరాభిషేకం
- మెగా లోక్ అదాలత్‌లో రూ.2లక్షలు తిరిగి ఇప్పించినందుకు హర్షం

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 14 : ఓ ఇంజినీరింగ్ కళాశాలలో సీటు ఇప్పిస్తానని దళారీ తీసుకున్న రూ.2లక్షలను తిరిగి ఇప్పించి లోక్ అదాలత్ ద్వారా కేసును పరిష్కరించినందుకు మానుకోట జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, జూనియర్ సివిల్ జడ్జి తిరుపతికి బాధితుడు పత్తి వెంకన్న ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారిద్దరి చిత్రపటాలకు పాలతో అభిషేకం చేసి కృతజ్ఞత చాటుకున్నాడు. కురవి మండలం గుండ్రాతిమడుగుకు చెందిన పత్తి వెంకన్న తన కుమారుడికి హైదరాబాద్‌లోని కళాశాలలో సీటు కోసం మేడ్చల్‌కు చెందిన కొండల్‌రెడ్డి అనే దళారీకి రూ.2లక్షలు ఇచ్చాడు. అయితే అతడు సీటు ఇప్పించకపోగా డబ్బులు కూడా తిరిగి ఇవ్వకపోవడంతో కురవి పోలీస్‌స్టేషన్‌లో వెంకన్న ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ సతీశ్ దళారీని స్టేషన్‌కు పిలిపించి కేసు త్వరగా పూర్తయ్యేలా కృషి చేశాడని, ఫలితంగా శనివారం లోక్ అదాలత్‌లో రాజీమార్గం ద్వారా సమస్య పరిష్కారమైందని వెంకన్న హర్షం వ్యక్తంచేశాడు.

## రైస్ మిల్లర్‌కు షోకాజ్ నోటీసు

### ఆర్వో రిలీజ్ చేసిన కమిషనర్.. 'నమస్తే' ఎఫెక్ట్

కమలాపూర్, డిసెంబర్ 14 : : హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని శ్రీశైలం మల్లన్న రైస్ మిల్లు యజమానికి షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు పౌర సరఫరాల శాఖ అధికారులు శనివారం తెలిపారు. ఈ నెల 13న 'నమస్తే తెలంగాణ'లో 'అధికారుల తప్పిదం.. రైతులకు శాపం' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రైస్ మిల్లు కెపాసిటీకి మించి ధాన్యం దిగుమతి చేసుకోవడంతో ట్రక్ షీట్లు ఆన్‌లైన్‌లో నమోదు కాక నెలరోజులుగా 500 మంది రైతులకు డబ్బులు ఖాతాలో జమకాలేదు. ఈ నేపథ్యంలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ అదనంగా దిగుమతి చేసుకున్న ధాన్యానికి రిలీజ్ ఆర్డర్ (ఆర్వో) ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. దీంతో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతుల ట్రక్ షీట్లను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుండడంతో బాధిత రైతులకు ఊరట లభించింది.

## మా పిల్లలతో మాట్లాడించరా?

- గణపురం ఎంజేపీ ఎదుట తల్లిదండ్రుల ఆందోళన
- బతిమిలాడినా కనికరించలేదని ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం



గణపురం మండలం గాంధీనగర్‌లోని ఎంజేపీ పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థినుల తల్లిదండ్రులు

గణపురం, డిసెంబర్ 14 : తమ పిల్లలతో మాట్లాడనివ్వాలని తల్లిదండ్రులు శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం గాంధీనగర్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే వసతి గృహం ఎదుట ఆందోళన చేపట్టారు. నిర్లక్ష్యపు సమాధానం చెప్పిన ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే.. రెండో శనివారం కావడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను చూసేందుకు జ్యోతిబాపూలే వసతి గృహానికి వచ్చారు. కానీ, ప్రిన్సిపాల్ స్వప్న, సిబ్బంది మాట్లాడడానికి వారికి అనుమతి ఇవ్వలేదు. దీంతో తల్లిదండ్రులు ప్రిన్సిపాల్ వద్దకు వెళ్లి బతిమిలాడినా కనికరించలేదు. దీంతో అసహనానికి గురైన తల్లిదండ్రులు ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 9 గంటలకే తల్లిదండ్రులు హాస్టల్‌కు చేరుకున్నారు. ఇదే సమయంలో డైట్‌ను ప్రారంభించేందుకు మంత్రులు అక్కడికి రావాల్సి ఉంది. అయితే మంత్రుల కార్యక్రమం ఆలస్యం కావడంతో తల్లిదండ్రులు తమ పిల్లలతో మాట్లాడించాలని, మధ్యాహ్నం 1.30 గంటల సమయమవుతున్నదని, తాము ఉదయం 9 గంటలకు వచ్చామని ఉపాధ్యాయులతో మొరపెట్టుకున్నారు. అయినా, ఉపాధ్యాయులు వినకపోవడం, ప్రిన్సిపాల్ అక్కడికి చేరుకొని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో తల్లిదండ్రులు ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అక్కడే ఉన్న బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి శైలజ విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వచ్చి సముదాయించి, విద్యార్థులతో మాట్లాడించారు.

## ముకుంద జ్యూవెల్లర్స్ ప్రారంభం

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 14 : హనుమకొండ చౌరస్తాలో ముకుంద జువెల్లర్స్ ఫ్యాక్టరీ ఔట్‌లెన్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి–నీలిమ దంపతులు శనివారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయిని మాట్లాడుతూ ప్రజలకు నమ్మకమైన, నాణ్యమైన బంగారాన్ని అందించాలని సూచించారు. ఫ్యాక్టరీ ఔట్‌లెట్‌ను హనుమకొండ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ముకుంద జ్యూవెల్లర్స్ మేనేజింగ్ డైరెక్టర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ కేపీహెచ్‌బీ, కొత్తపేట, సోమాజీగూడ, ఖమ్మంలోని తమ బ్రాంచ్‌లు ఊహించినదాని కంటే ఎక్కువ విజయవంతం కావడంతో హనుమకొండలో నూతన బ్రాంచ్‌ను ప్రారంభించామన్నారు. త్వరలోనే మరిన్ని బ్రాంచ్‌లను ఏర్పాటు చేస్తామని పేర్కొంటూ తమను ప్రోత్సహిస్తున్న కస్టమర్లకు నరసింహారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



జ్యోతిప్రజ్వలన చేసి ముకుంద జ్యూవెల్లర్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



మానేరు వాగు ఇసుకను ట్రాక్టర్లలో లోడ్ చేస్తున్న కూలీలు

# తోడేస్తున్నారు!

### • నిబంధనలకు పాతరేసి ఇసుక రవాణా

- స్థానిక అవసరాలకే వినియోగించాలన్న ఎమ్మెల్యే
- ఇదే అదనుగా రెచ్చిపోతున్న అక్రమార్కులు
- నిత్యం వందలాది ట్రాక్టర్లతో పలుచోట్ల డంప్
- అక్కడి నుంచి లారీల్లో పట్టణాలకు సరఫరా
- రాజకీయ ఒత్తిళ్లతో అడ్డుకోలేకపోతున్న అధికారులు
- మానేరు, చలివాగుల్లో బయటపడుతున్న బండరాళ్లు

టేకుమట్ల, డిసెంబర్ 14 : టేకుమట్ల మండలంలోని మానేరు, చలివాగుల్లో నిబంధనలకు పాతరేసి ప్రతి రోజు భారీగా ఇసుకను తోడేస్తున్నారు. స్థానిక అవసరాలకు ఎలాంటి ఆంక్షలు, అనుమతులు లేకుండా పగలు మాత్రమే ఇసుకను తీసుకెళ్లవచ్చని, గ్రామీణ ప్రాంత ప్రజల నిర్మాణాలకు సహకరించాలని స్థానిక ఎమ్మెల్యే సూచించారు. ఇదే అదునుగా భావించిన కొందరు ఇసుక వ్యాపారులు రెచ్చిపోతున్నారు. మండలంలోని రాఘవరెడ్డిపేట, రామకృష్ణాపూర్(వీ), బూర్నపల్లి, ద్వారకాపేట, కలికోటపల్లిలోని వాగుల నుంచి అడ్డూఅదుపు లేకుండా ఇసుకను తవ్వి వందలాది ట్రాక్టర్లలో రేగొండ మండలంలోని ప్రధాన రహదారి వెంట ఉన్న గ్రామాల్లో, హనుమకొండ జిల్లా పరకాలలో డంప్ చేస్తున్నారు. అక్కడి నుంచి లారీల్లో ఇతర పట్టణాలకు తరలిస్తున్నారు. మానేరులో ఉదయం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు, చలివాగులో మాత్రం రోజంతా ఇసుకను తోడేస్తున్నారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేస్తే ట్రాక్టర్లను పట్టుకుంటున్నారని, రాజకీయ ఒత్తిళ్లతో తిరిగి వదిలేస్తున్నారని మండల ప్రజలు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుమ్మడవెల్లి– రామకృష్ణాపూర్ (వీ) గ్రామాల మధ్యలో కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన చెక్ డ్యామ్ కింద నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తోడడంతో బండలు తేలి ప్రమాదకరంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



టేకుమట్ల మండలం కలికోటపల్లిలో డంప్ చేసిన ఇసుక

### కూలీలది మరో దందా..

ఇక్కడి కూలీలు స్థానికులకు రూ. 400 నుంచి రూ. 500కు ట్రాక్టర్ లోడ్ చేస్తారు. అయితే ఇతర ప్రాంతాల నుంచి ఎక్కువ ట్రాక్టర్లు వస్తుండడంతో వారి నుంచి రూ. 1,500 వసూలు చేస్తున్నారు. డబ్బులు ఎక్కువ వస్తుండడంతో స్థానికులను పక్కన పెట్టి బయటి వారికే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టి సారించి స్థానికేతరులకు కాకుండా స్థానిక అవసరాలకు మాత్రమే అనుమతులివ్వాలని ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయమై కొద్ది రోజుల క్రితం బీఆర్‌ఎస్ టేకుమట్ల మండలాధ్యక్షుడు సట్ల రవిగౌడ్, ఇతర నాయకులు స్థానిక తహసీల్దార్, ఎస్సైకి వినతిపత్రం ఇచ్చినప్పటికీ ఎలాంటి ఫలితం లేదు.

### డస్ట్ పేరిట నిల్వ..

మండలంలోని కలికోటపల్లి మానేరు వాగు ఒడ్డున ఉన్న ఇసుక మేటలను డస్ట్ పేరుతో ఎలాంటి అనుమతులు లేకుండానే రహదారి వెంట అక్రమంగా నిల్వ చేస్తున్నారు. ఇక్కడి నుంచి పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలోని ఇటుక బట్టీల వ్యాపారులు తరలించుకుపోతున్నట్లు సమాచారం. అధికారులు ఎలాంటి అనుమతి ఇవ్వలేదని చెపుతున్నా పంట పొలాల్లో పేరుకుపోయిన డస్ట్ మాటున వాగును ఆనుకొనే పెద్ద ఎత్తున ఇసుక డంప్‌లు ఏర్పాటు చేస్తున్నారు. వాగు వెంట ఇసుక డంప్ చేసుకోవడానికి తాము ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని మైనింగ్ ఏడీ జయరాజ్ తెలిపారు. ఈ విషయమై తహసీల్దార్ విజయలక్ష్మి మాట్లాడుతూ తన భూమిలో వేసిన ఇసుక మేటలను తొలగించుకుంటానని ఓ రైతు కోరగా అందుకు సంబంధించిన వివరాలతో మైనింగ్ అధికారులకు లేఖ రాశామని, కానీ వారు అనుమతులిచ్చినట్లు తమకు కాపీ పంపించలేదని పేర్కొన్నారు. కాగా, పొలాల్లో వేసిన ఇసుక మేటలను తీసి వాగులో పోయాలని లేదా గెట్లుగా పోసుకోవాలని, లారీలతో ఇతర ప్రాంతాలకు తరలించడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### అధికారులను శాసిస్తున్న అక్రమార్కులు



మండలంలో సహజవనరులైన ఇసుక, మొరం దందా విచ్చలవిడిగా సాగుతున్నది. ప్రజలు, కుల సంఘాలు, నాయకులు అడ్డుకుంటున్నా ఫలితం లేదు. అధికారులకు సమాచారం ఇస్తే వారు తమ విధులు నిర్వర్తించకుండా అక్రమార్కులు శాసిస్తున్నారు. పట్టుబడిన ప్రతి ఒక్కరు ఎమ్మెల్యే పేరు చెప్పి బయటకు వస్తున్నారు. ప్రజా ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతున్నది. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి అక్రమ దందాలకు, అక్రమార్కులకు చెక్ పెట్టి, అధికారులు తమ పని చేసుకునేలా స్వేచ్ఛనివ్వాలి.

– పొన్నం భిక్షపతి గౌడ్, కుందనపల్లి, టేకుమట్ల

### ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు



మండలంలోని వాగుల నుంచి ఇసుక తరలించేందుకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. మండల పరిధిలోని నిరుపేదలు కట్టుకునే ఇళ్లకు సంబంధించిన పత్రాలు చూపించి ఫ్రీగా ఇసుకను తీసుకోవచ్చు. దీనిని ఆసరాగా చేసుకున్న కొందరు ఎలాంటి పత్రాలు చూపించకుండానే ట్రాక్టర్లలో అధిక లోడ్‌తో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. మా సిబ్బంది అడ్డుకుంటే మాకు ప్రభుత్వం చెప్పింది.. మీరెవరు ఆపడానికి అంటూ డ్రైవర్లు దురుసుగా ప్రవర్తిస్తున్నారు. పట్టుకున్న వెంటనే మాపై ఒత్తిడి తీసుకురావడంతో వదిలేయాల్సి వస్తున్నది. చేసేదేమీ లేక సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– విజయలక్ష్మి, తహసీల్దార్, టేకుమట్ల

## సెల్‌ఫోన్ చార్జింగ్ పెడుతూ..

### విద్యుత్ షాక్‌తో బాలుడి మృతి

- ట్రాన్స్‌ఫార్మర్‌లో ఎర్త్ సమస్యే కారణమని స్థానికుల ఆరోపణ

చెన్నారావుపేట, డిసెంబర్14 : సెల్‌ఫోన్ చార్జింగ్ పెడుతుండగా విద్యుత్ షాక్‌కు గురై బాలుడు మృతి చెందిన ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం జల్లి గ్రామంలో శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సంపంగి రాకేశ్(16) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. శనివారం ఉదయం ఇంట్లో సెల్‌ఫోన్ చార్జింగ్ పెడుతుండగా షార్ట్ సర్క్యూట్‌కు గురై కింద పడ్డాడు. గమనించిన తల్లి, చుట్టుపక్కల వారు వెంటనే నర్సంపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిశీలించిన డాక్టర్లు బాలుడు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. తండ్రి రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు చెన్నారావుపేట ఎస్సై రాజేశ్‌రెడ్డి తెలిపారు. కాగా, గ్రామంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఎర్త్ సమస్య కారణంగానే బాలుడు మృతి చెందాడని స్థానికులు తెలిపారు. ఈ విషయంపై పలుమార్లు విద్యుత్ అధికారులకు తెలిపినా పట్టించుకోలేదన్నారు. శనివారం ఉదయం బాలుడు మృతి చెందిన సమయంలో గ్రామంలోని మరికొందరు కూడా షాక్‌కు గురైనట్లు స్థానికులు తెలిపారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు చేయించాలని కోరారు.



సంపంగి రాకేశ్ (ఫైల్)

## పనులు బీఆర్‌ఎస్‌వి.. ఆర్భాటం కాంగ్రెస్‌ది

మంజూరు చేసిన వాటికే మళ్లీ శంకుస్థాపనలు

కేసీఆర్ సర్కారు హయాంలోనే నిధులు

- మెడికల్ కళాశాలకు రూ.130 కోట్లు
- సుభాష్‌కాలనీ రోడ్డుకు రూ.10 కోట్లు
- మరోసారి ప్రారంభించిన మంత్రులు

జయశంకర్ భూపాలపల్లి, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ) : బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన పనులకే కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ శంకుస్థాపనలు చేస్తున్నది. గత కేసీఆర్ సర్కారు భూపాలపల్లి జిల్లా ప్రత్యేక అభివృద్ధికి బాటలు వేసింది. ఈ క్రమంలో జిల్లా ప్రధాన ఆస్పత్రి, మెడికల్ కళాశాల, ఆయుష్ ఆస్పత్రి, జిల్లా కేంద్రంలో జంక్షన్ల అభివృద్ధి, సెంట్రల్ లైటింగ్ కోసం నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించింది. అయితే బీఆర్‌ఎస్ ప్రభుత్వం చివరి దశలో మంజూరు చేసి పనులు ప్రారంభించగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వాటికి చెక్ పెడుతున్నది. అప్పుడు బీఆర్‌ఎస్ ప్రారంభించిన పనులకే మళ్లీ శంకుస్థాపనలు చేయడం చర్చనీయాంశమైంది. మెడికల్ కళాశాలను మంజూరు చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం అదనపు కళాశాల భవనానికి సైతం రూ.130 కోట్లు మంజూరు చేసింది. మొదటి విడత చేపట్టిన పనులు చివరి దశకు చేరుకోగా రెండో విడత మంజూరు చేసిన రూ.130 కోట్లతో పనులు ప్రారంభించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఈ క్రమంలో శనివారం మంత్రులు దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు అవే నిధులతో మళ్లీ మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేశారు. అలాగే గతంలో ఏ పాలకులూ చేయని విధంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం 100 పడకలతో జిల్లా ప్రధాన ఆస్పత్రి నిర్మించి ములుగు, భూపాలపల్లి జిల్లాలతో పాటు సరిహద్దు రాష్ట్రాల ప్రజలకు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ ఆస్పత్రిలో శనివారం మంత్రులు అదనపు భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే అంబేద్కర్ చౌక్ నుంచి కేటీకే–2 ఇంక్లైన్ వరకు రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్, డ్రైనేజీ నిర్మాణాలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేయగా పనులు గతంలోనే ప్రారంభమయ్యాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పనులు నిలిపివేసింది. సుమారు పది నెలల తర్వాత గతంలో పనిచేస్తున్న కాంట్రాక్టర్‌ను తొలిగించి మళ్లీ మరో కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించి శనివారం మంత్రులతో శంకుస్థాపన చేయించడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ప్రభుత్వం మారితే పనులు ఆపివేస్తారా? మరో కాంట్రాక్టర్‌కు అప్పగిస్తారా? ప్రారంభించిన పనులకే మళ్లీ శంకుస్థాపనలు చేస్తారా? అని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



అంబేద్కర్ సెంటర్ నుంచి రెండో గని వరకు బీఆర్‌ఎస్ చేసిన పనులకు మళ్లీ శంకుస్థాపన చేస్తున్న మంత్రులు శ్రీధర్‌బాబు, రాజనర్సింహ

### కాంగ్రెస్ సభకు స్పందన కరువు

- మంత్రుల కోసం 4గంటల పాటు నిరీక్షణ.. మధ్యలోనే వెళ్లిపోయిన జనం
- మంత్రి దామోదర ప్రసంగిస్తుండగా ఖాళీగా కుర్చీలు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో నిర్వహించిన మంత్రుల సభలో జనాలు లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

కృష్ణకాలనీ, డిసెంబర్ 14 : భూపాలపల్లిలో కాంగ్రెస్ బహిరంగ సభకు స్పందన కరువైంది. షెడ్యూల్ ప్రకారం మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ శనివారం ఉదయం 11గంటలకు రావాల్సి ఉంది. అయితే 10గంటల నుంచి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన జనం గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. చివరికి వారు మధ్యాహ్నం 3.30గంటలకు చేరుకొన్నప్పటికీ అప్పటికే జనాలు ఓపిక లేక విసుగెత్తిపోయారు. మొదటగా ఎమ్మెల్యే గండ్ర, ఆ తర్వాత మంత్రి శ్రీధర్‌బాబు ప్రసంగించగా వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర మాట్లాడుతుండగానే జనాలు ఇంటిబాట పట్టడం కనిపించింది. సభ మొదలైనప్పటి నుంచే జనాలు ఇక్కడ ఉండేందుకు ఇష్టపడలేదు. దీంతో సభలో జనాలు లేక కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి.


